

క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 130, పచ్చిమిర్చి 80, బెండ 60, కాకర 70, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 50, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 300, వెల్లుల్లి 220.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కల్యాణిగార్డెన్ ఫీడర్ పరిధిలో హైదర్‌నగర్ పెట్రోల్ పంప్, మియాపూర్ ప్రధాన రోడ్డు, మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ రోడ్డు, మెట్రో రైల్వే స్టేషన్ ఏరియా, మాధవనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేషనల్ హ్యాండ్‌లూమ్ డే- 2023

మాదాపూర్: చేనేత వస్త్రాలను ధరించి పలువురు మోడల్స్ ర్యాంప్ పై క్యాట్‌వాక్ చేసి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నేషనల్ హ్యాండ్‌లూమ్ డే-2023ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మోడల్స్ వివిధ రకాల చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ సెక్రటరీ జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎస్ఐగా నాగలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్ఐగా నాగలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్ఐ ప్రసాద్‌రావు బదిలీపై జహీరాబాద్ వెళ్లారు. సదాశివపేట్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మి బదిలీపై పటాన్‌చెరుకు వచ్చారు.

పటాన్‌చెరు తహసీల్దార్‌గా భాస్కర్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు తహసీల్దార్‌గా భాస్కర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న పరమేశం బదిలీపై సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో నాగర్ కర్నూల్‌కు చెందిన భాస్కర్ పటాన్‌చెరు తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్‌లో ఈ నెల 9 నుంచి నిర్వహించనున్న అలీఅబ్బాస్ జాతర పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. ఉత్సవాల నిర్వాహకులు రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన ఇమ్రాన్ బేగంకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.30వేల చెక్కును ఎమ్మెల్యే గాంధీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. సీఎం సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కవి గద్దర్

పటాన్‌చెరు: ప్రజాగాయకుడు, తెలంగాణ ఉద్యమనేత గద్దర్ మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాకళలు, జానపదం ఉన్నంతకాలం, ప్రజా కవి గద్దర్ పేరు నిలిచి ఉంటుందని తన ఆట పాటలతో ప్రజల హృదయాల్లో చైతన్యం రగిలించారని కొనియాడారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, మున్సిపాలిటీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్, ట్రెజరర్ సుధాకర్, జనరల్ సెక్రెటరీ మహేష్, నాయకులు పాల్గొన్నారు.



ఆకర్షణీయంగా లింగంపల్లి ప్రాథమిక పాఠశాల
కొత్తగా నిర్మించిన తరగతి గది

విద్యార్థుల భవిష్యత్ 'నిర్మాణ్'

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా లింగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- 'నిర్మాణ్' సంస్థతో సరికొత్త శోభ
- మౌలిక వసతులు, పెయింటింగ్స్‌తో కొత్తరూపు
- త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలు తయారవుతున్నాయి. పేద, మధ్య తరగతి పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే ప్రభుత్వ విద్యాలయాలలో ఒకవైపు ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' ద్వారా మరోవైపు ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు కూడా మేముసైతం అంటూ ముందుకురావడంతో కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. అందులో భాగంగా 'నిర్మాణ్' సంస్థ లింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసుకుంది. ఈ ప్రాథమిక పాఠశాలలో 284 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు.

– శేరిలింగంపల్లి



'నిర్మాణ్' సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు..

- లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.13 లక్షలతో ఒక క్లాస్‌రూమ్, రూ.6.50 లక్షలతో మోడల్ టాయిలెట్స్ (బాలికలు, బాలురకు వేర్వేరుగా) నిర్మించారు.
- తరగతి గదులు, ఆఫీస్ రూమ్‌లకు ఎలక్ట్రికల్ వైరింగ్, 12 ఫ్యాన్లు, 12 ట్యూబ్ లైట్స్‌ను అమర్చారు.
- ఇప్పటికే తరగతి గదుల్లో పెయింటింగ్ పనులు పూర్తి చేశారు.
- స్కూల్ గోడలపై విద్యాపరమైన అంశాలతో కూడిన పెయింటింగ్ ,కరిక్యులమ్ రిలేటెడ్ పెయింటింగ్స్ వేశారు.
- ఈ పాఠశాల చుట్టూరా ప్రహరీ గోడ నిర్మాణం
- ఒక్కో విద్యార్థికి ఆటబొమ్మలు, బ్యాగు, వాటర్ బాటిల్స్, లైబ్రరీ బుక్స్, జామెట్రీ బాక్స్ అందించారు.
- త్వరలో రూ. 5లక్షలతో ఆర్ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



పాఠశాల గోడలపై పెయింటింగ్స్



మోడల్ టాయిలెట్స్

సంతోషంగా ఉంది



లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిర్మాణ్ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉంది. క్లాస్ రూం, మోడల్ టాయిలెట్స్ నిర్మించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటోంది.

–భీమయ్య, హెచ్‌ఎం, లింగంపల్లి ప్రభుత్వ పాఠశాల

స్కూల్ రూపురేఖలు మారాయి



నిర్మాణ్ సంస్థతో లింగంపల్లి ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మారాయి. ఈ పాఠశాల అభివృద్ధికి వారు చేస్తున్న కృషి అభినందనీయం. ఆర్ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలకు వసతులు కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది.

– శ్రీనివాస్, లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళులు



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: అట్టడుగు వర్గాలను చైతన్యపరిచిన ప్రజా గాయకుడు గద్దర్ సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని మాజీ ఎమ్మెల్యే ఎంభిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్‌తో కలిసి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించిన గద్దర్ తెలంగాణ ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. గద్దర్ మరణం రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాఘవేంద్ర రావు, ఎల్లేష్, అనిల్‌యాదవ్, రమేష్, ఆకుల నర్సయ్య, బాలాజీ, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి అరుదైన అవకాశం



కీర్వాణి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థిని కీర్వాణి కందాలా పబ్లిక్ హెల్త్-హెల్త్ ఇన్ఫర్మేటిక్స్‌లో ఎంఎస్ చదివే అవకాశాన్ని యేల్ విశ్వవిద్యాలయం కల్పించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ సిస్టమ్స్ బయాలజీ మూడవ సంవత్సరం పూర్తి చేసిన కీర్వాణికి అమెరికాలోని డార్ట్‌మౌత్ యూనివర్శిటీలో కాంపిటీటివ్ బయోమెడికల్ సైన్సెస్‌లో ఎంఎస్ ప్రవేశం కూడా అందించడం విశేషం. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

జెడ్సీని కలిసిన దివ్యాంగులు



వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దివ్యాంగుల సమాఖ్య బృందం

రాయదుర్గం: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య బృందం సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. శేరిలింగంపల్లిలోని దివ్యాంగులకు డబుల్ ఇళ్లలో 5 శాతం రిజర్వేషన్ కల్పించి సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా జెడ్సీని కలిసిన వారిలో సమాఖ్య అధ్యక్షుడు మేకల అశోక్‌కుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఫకీర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు ఊర్మిళ, సాయిబాబా, మధు, ముక్తార్, కుమార్, రషీద్, నర్సింహారావు, వల్లి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అమీన్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



పటాన్‌చెరు: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం, నరేంద్ర కాలనీ సీత లేఔట్, బీరంగూడలో మొక్కల పంపిణీని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డితో కలసి పంపిణీ చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కృష్ణ ,పట్లోళ్ల కల్పన ఉపేందర్ రెడ్డి, చంద్రకళ గోపాల్, ఎడ్ల రమేష్ , సీనియర్ నాయకులు చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకం



తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ రవీందర్‌రావు

రాయదుర్గం: నిర్మాణ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ పి రవీందర్‌రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య సెమినార్ హాల్‌లో 'ఎస్కీ'లోని సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ డివిజన్ ఆధ్వర్యంలో 22 రాష్ట్రాలకు చెందిన 35 మంది ప్రభుత్వ ఇంజనీర్లకు శుక్రవారం వరకు సాగే 'అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్, ప్లానింగ్, డిజైన్ అండ్ కన్స్ట్రక్షన్ ఆఫ్ లాంగ్ స్పాన్ బ్రిడ్జెస్' అంశంపై సోమవారం శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రోడ్లు, భవనాల శాఖలో బీఐఎం, ఎంఐడీఏఎస్ సిఐఎం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలను వినియోగించడం వల్ల ఎంతో మేలు జరుగుతోందన్నా రు. నిర్మాణంలో ఇంజనీర్లు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ కూడా అవసరమన్నారు. బ్రిడ్జీల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ లాంగ్ స్పాన్ బ్రిడ్జిలలో ప్రాముఖ్యత, నాణ్యత, తాజా నిర్మాణం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, 'ఎస్కీ' అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ క్యాంప్

గచ్చిబౌలి: కళాకారుల కళా నైపుణ్యానికి అద్దం పట్టేలా జాతీయస్థాయి 'ఆర్ట్ క్యాంప్' కొనసాగింది. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో హోటల్ రాడిసన్, ఈబీఆర్ సంయుక్తంగా ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహి చారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కళాకారులు తమ సత్తా చాటారు. శేరిలింగంపల్లి కొండాపూర్‌కు చెందిన కళాకారుడు రాజుబత్తుల, విజయనగరంకు చెందిన మారుతి పైలా ఈ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారుడు రాజు బత్తుల మాట్లాడుతూ ఈ తరం చిత్రకారుల ఆలోచనలు, వారి ప్రయాణం తెలుసుకోవడానికి ఇది ఎంతో దోహదం చేస్తుందన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా



శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐక్య ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఎం.రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అనేక వాగ్దానాలు చేసి గెలిచిన తరువాత విస్మరించారన్నారు. దేశంలో కనీస అవసరాలైన విద్య, వైద్యం, కూడు, గుడ్డ, ఉపాధి అవకాశాలు లేని వారు 40 శాతం ఉన్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాటిలో భాగంగా ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలం కేటాయించి, ఇంటిబంధు పథకంలో భాగంగా రూ.10 లక్షలను ఇవ్వాలన్నారు. అదే విధంగా ధరణిలో లోపాలను సవరించాలని కోరారు. సర్వే నంబర్‌ల వారీగా యూనిట్‌గా తీసుకొని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు వనం సుధాకర్, మధుసూదన్, అనిల్‌కుమార్, మురళీ, దశరథ్ నాయక్, కళావతి, నర్సింహ, లావణ్య, శివాని, సుల్తానా బేగం, రంగస్వామి, ఇసాక్, లలిత, శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటితం కావాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్
- యాదవ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



యాదవ గర్జన పోస్టర్‌ను విడుదల చేసిన రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: తమ హక్కులను సాధించుకునేందుకు యాదవ సమాజం సంఘటితం కావాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ అన్నారు. సోమవారం మసీద్ బండలో యాదవ గర్జన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవ హక్కులను కాలరాస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన ఎంపీ, ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవుల కేటాయింపు, రిజర్వేషన్ పునరుద్ధరణ డిమాండ్ నెరవేర్చుకునేందుకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద యాదవ గర్జన ఉంటుందని యాదవ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములు యాదవ్, యువజన అధ్యక్షులు వంశీ మోహన్, రాధాకృష్ణ యాదవ్, అశోక్ యాదవ్, బాలు యాదవ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువత చూపు బీఆర్ఎస్ వైపు...



పార్టీ కండువా కప్పి యువతను పార్టీలో చేర్చుకున్న ఎమ్మెల్యే గాంధీ

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

హఫీజ్‌పేట్ : యువత బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన 100 మంది యువత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పటిష్టానికి సైనికుల్లా పని చేయాలన్నారు. బంగారు తెలంగాణలో భాగస్వాములమవుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీనారాయణ, ఎండీ ఇబ్రహీం, కాశీనాథ్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ బోనాలు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్ మసీద్‌బండలో శ్రావణ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొద్ది సేపు నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రవీందర్ ముదిరాజ్, రంగారావు, మోహన్‌గౌడ్, గణేష్ ముదిరాజ్, మోహన్ ముదిరాజ్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి



విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందజేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు.సోమవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పార్కర్ హనీ ఇన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామాల్లోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, రామేశ్వరంబండ గ్రామ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, ఉపసర్పంచ్ నాగేష్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా సాగాలి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు.సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధి నాగార్జున కాలనీలో రాఘవేంద్ర అనే వ్యక్తికి ఉపాధి పొందేలా ఐరన్ బాక్స్ ఇతర సామగ్రిని నీలం మధు ముదిరాజ్ అందజేశారు.అనంతరం ఆయన దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేష్, మురళీ, శ్రీనివాస్, ఆశ్రఫ్ ,శ్రీను, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

పటాన్‌చెరు: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అమీన్‌పూర్‌లో 393 దళిత కుటుంబాలకు దళిత బంధు పథకం ఇవ్వాలని కోరారు. సోమవారం మండల అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొని సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... కేసీఆర్ దళితద్రోహి అని అమీన్‌పూర్ పరిధిలో 393 కుటుంబాలు ఉంటే బీఆర్ఎస్ పార్టీ నాయకుల అనుచరులు 48 మందికి దళిత బంధు ఇవ్వడం తగదన్నారు. దళితులందరికీ దళితబంధు ఇచ్చే అంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి,మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ నర్సింగ్‌రావు,సుధాకర్ గౌడ్,ఎంపీపీ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.